ఓంశ్రీసాయిరాం

మనసు మాలిన్యములనెల్ల మట్టుబెట్టి
పరమ పరిశుద్ధ భావముల్ పాదుగొల్పి
జ్ఞానదృష్టియునేర్పడ కాననగును
విశ్వమంతయు బ్రహ్మమై వెలుగు నిండు.

పువ్వు లేక కాయ పుట్టదు చెట్టున
కాయలేక ఫలము కలుగబోదు
కర్మనిష్ఠ లేక కలుగదు భక్తియు
భక్తి లేక జ్ఞాన భరితుడగున!

పవిత్రాత్మ స్వరూపులారా!

ఎల్లప్పుడూ సామాన్యమైనటువంటి స్థితియందుండుట ప్రగతి శీలుడైన మానవునకు లక్షణము కాదు. విద్యార్థి నిరంతరమూ ఒకే తరగతియందుండుటకుప్పుకొనడు. ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క తరగతిని దాటి తాను ముందుకు పోతుంటాడు. అదేవిధముగా ఆధ్యాత్మిక మార్గమున పురోగమించు సాధకుడు నిరంతరము ఒకే స్థితియందుండుట ఏమాత్రముకూడను సరైన మార్గము కానేరదు. నిరంతరము ఏక మార్గమందే జీవించుట మంచిది కాదు. క్రమక్రమేణా విశిష్టాద్వైతమునుండి అద్వైతమునకు ప్రాకి ఉన్నతస్థాయిని, మహోన్నతమైన తత్త్వమును అర్థముచేసుకోవటానికి ప్రయత్నించాలి. ఉచ్ఛస్థితిని పొందే లక్ష్యమునందే సాధకుడు ప్రప్రథమమునందు సాధారణమైన పూజలు, అర్చనలయందు ప్రవేశించాలి. సర్వసాధారణముగా భగవంతుని పూలతో అర్చించటము, షోడశోపచారములతో పూజించటము, ఈవిధమైన క్రమమును భారతీయులు అనుసరిస్తుంటారు. కాని, దీనికంటే ఉత్తమమైన మార్గము మరొకటి కలదు.

సత్‌శీలముచేతను, సదాచారములచేతను భగవంతుని ఆరాధించటము ఒక విశేషమైనటువంటి భక్తి. ఇదియే పరాభక్తి అనికూడా పిలుబడుతూ వచ్చింది. నిరంథరమూ పూలచేత అర్చించటము, అర్పించటము సర్వసాధారణమైన స్థాయియందు మాత్రమే నిలిచిపోతూ ఉంటుంది. ఇది మంచిదే! కాని, నిరంథరము అదే స్థాయియందుండి ఉచ్ఛస్థాయిని మనం కోల్పోవటం సరియైనటువంటిది కాదు. సద్గుణములచేతను, సదాచారములచేతను, సచ్చింతనలచేతను, సత్సంగముచేతను సర్వేశ్వరుని ఆరాధించటము ఒక విశేషమైన ఆరాధన. కనుకనే, సద్గుణములచేతను, సచ్చింతనలచేతను, సదాచారములచేతను, సర్వేశ్వరుని ఆరాధన సహజమైనటువంటిదైగాక ఉన్నతమైనదియై ఉచ్ఛస్థితిని అందుకొనే పరిస్థితికి పరాభక్తిలో పాల్గొంటుంది. దీనినే స్మృతి 'గుణ అర్చన' అని పేరుచేత, 'ఎట్టి గుణములచేత పరమాత్ముడు ప్రసన్నుడు కాగలడు' అనే విధానాన్నికూడను నిరూపిస్తూ వచ్చింది.

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియ నిగ్రహః
సర్వభూతదయా పుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతిపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తథైవ చ
సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్.

మొట్టమొదటి పుష్పము 'అహింస', రెండవ పుష్పము 'ఇంద్రియనిగ్రహము', మూడవ పుష్పము 'సర్వభూతదయ', నాల్గవ పుష్పము 'క్షమ', ఐదవ పుష్పము 'శాంతి', ఆరవది 'తపః' పుష్పము, ఏడవది 'ధ్యాన' పుష్పము, ఎనిమిదవది ' సత్య' పుష్పము. ఈ ఎనిమిది పుష్పములచేత ఆరాధన సలిపినప్పుడు భగవంతుడు ప్రసన్నుడు కాగలడు అని దీని అంతరార్థము.

ప్రాకృతమైన పుష్పములు కొంతకాలములో వాడిపోయి, వీడిపోయి, దుర్గంధములకు గురౌతుంటాయి. అట్టి పుష్పములచేత, అనిత్యమైన ఆరాధనలు సల్పి , అనిత్యమైన ఫలములు పొంది, అనిత్యస్థాయిని మనం పొందేకంటే నిత్య, సత్య, నిర్మలమైన శాశ్వత పుష్పములను అర్పితముచేసి స్థిరమైన గమ్యమును చెందే అవకాశమునకు ప్రయత్నించాలి.మన భారతదేశమందు అనేకమంది మహనీయులు ఇలాంటి క్రమపద్ధతులను అనుసరించియే ఉన్నతస్థాయిని చేరుకొన్నారు. ఇట్టి సత్యాన్ని సర్వసాధారణమైన మానవులు గుర్తించుకొనలేక, నిరంతరముకూడను ఆ పుష్పములచేతనే పూజిస్తూ కేవలము అశాశ్వతమైన ఫలితాన్ని తాము పొందలేక నిరాశకు, నిస్పృహకు గురైపోయి, నిరుత్సాహానికి లోబడిపోతున్నారు. కనుక, సత్యమైన స్థాయిని, నిత్యమైన భావమును, పవిత్రమైన గమ్యమును పొందాలని ఆశించే సాధకునకు ఈ శాశ్వతమైన గుణపుష్పములను అర్పించే స్థలమును మనము చేరటానికి ప్రయత్నించాలి.

లౌకిక పుష్పములను మనకు తోటలకొలది, కొండలకొలది లేక బజారుల కొలది విచారణచేసి దానిని స్వీకరించే శ్రమకు గురికాకుండా గుణపుష్పములు మన చిత్తమనే బృందావనమందే చక్కగా వికసిస్తున్నాయనే సత్యాన్ని మీరు గుర్తించాలి. మీ హృదయబృందావనమందే ఈ సుగంధపుష్పములనే గుణములు నిరంతరమూ వికసిస్తున్నాయి. ఆనందమనే సుగుణాన్ని

అందిస్తున్నాయి.

దివ్యాత్మస్వరూపులారా!

ఈనాడు మీరు అర్పించే పుష్పములు మీరు సృష్టించినటువంటివి కాదు. ఏ వృక్షములనుండియో, ఏ మొక్కలనుండియో భగవంతునియొక్క సంఖల్పముచేత సృష్టింపబడిన పుష్పములను మీరు స్వీకరించి, ఆ పుష్పములనే తిరిగి భగవంతునికి అర్పిస్తున్నారు. భగవంతుడు సృష్టించిన పుష్పములను భగవంథునికే అర్పించటములో ఉన్న విశేషమేమిటి? అనేకమంధి గంగాజలములో స్నానము చేస్తూ గంగాజలమును తీసుకొని 'గంగార్పిత'మని తిరిగి గంగకే అర్పిస్తున్నారు. ఇది మీ తాత సొత్తు కాదు. నీవు సృష్టించినది కాదు. నీ జీవితమనే వృక్షములో నీవు అనేకవిధములుగా శ్రమపడి, అనేకవిధములుగా పోషించి, ఆర్జించి, కాపాడుకొన్న సద్గుములను నీవు భగవంతునికి అర్పితముచేయటంలో ఒకవిధమైన అంతరార్థము ఉంటుంది.

సద్గుణములు పెంటుకొనుటకు అనేక శ్రమలు పడవలసి వుంటుంది. కనుకనే, ఈ సద్గుణములచేతనే మనయొక్క దివ్యమైన చిత్తముకూడా ఏకాగ్రతమకు రాగలుగుతుంది. అట్లు లేకుండిన మనయొక్క మనస్సు ఏమాత్రమూకూడా, క్షణమైనా స్థిరముగా ఉండుటకు వీలుకాదు.

సద్గుణంబు లేక సచ్చింతనలు లేక
ధ్యానమందు మనసు పూనగలదె
ఇల్లు కట్టుటకును యిటుకలు సున్నంబు
కలుగకున్న ఇల్లు కట్టుటెట్లు?

కనుక, ధ్యానములో మనస్సు లీనముకావలెనంటే సద్గుణములు, సచ్చింతనలు మనము ప్రధానముగా సంపాదించుకోవాలి.

'అహింసా ప్రథమం పుష్పం'. ఇది మొట్టమొదటి పుష్పము. కేవలము ఇతరులను హింసించకుండుట, ఇతర ప్రాణులను బాధించకుండుట అహింసయని మనము భావిస్తున్నాము. ఇది సరియైన అర్థము కాదు. అహింస అనగా కాయముచేతను, వాక్కుచేతను, కర్మలచేతను ఎట్టి ప్రాణికి కూడను బాధ కలిగించకుండా ఉండటమే అహింస. మనోవాక్కాయ కర్మలు పరిశుద్ధముగావించుకునే ప్రయత్నమునకే 'త్రిపుటు' అని ఆధ్యాత్మికమందు ఒక ప్రత్యేకమైన పేరును కల్పించారు. ఇట్టి అహింస అనే పుష్పము

త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రయాయుధమ్
త్రిజన్మ పాప సంహారం ఏక బిల్వం శివార్పణమ్.

ఇట్టి హృదయాన్ని మనము అర్పితము గావించాలి శివునకు.

ఇక రెండవది 'ఇంద్రియనిగ్రహము'. మనయొక్క ఇంద్రియాలు ఇష్టానుసారంగా పరుగెత్తుతూ ఉంటాయి. పరుగెత్తే గుఱ్ఱములనుగాని, పశువులనుగాని విచ్చలవిడిగా వదలిపెట్టినప్పుడు అనేక ప్రమాదములకు గురౌతూ ఉంటాయి. దానిని మనము కొంతవరకు అదుపులో పెట్టుకొని సక్రమమైన మార్గమునందు, పవిత్రమైన దివ్యత్వమునందు ప్రవేశపెట్టటానికి ప్రయత్నించాలి. నిత్య, అనిత్య విషయ పరిశీలన జరిపి, విచక్షణా జ్ఞానముచేత, వివేకమైన ప్రవర్తనచేత ఆ ఇంద్రియములను మనము కొంతవరకు అదుపులో పెట్టుకోవాలి.

దివ్యాత్మస్వరూపులారా!

దేహము, ఇంద్రియము, మనస్సు, బుద్ధి మనము ధరించినటువంటి ఉపాధులు. 'దహ్యతీతి దేహః' దహించునటువంటిది దేహము. ఎప్పుడు? మరణించిన తరువాతమాత్రము దహించేటట్టిదా, ఈ దేహము, కాదు. బ్రతికి ఉండినప్పుడే చింథలచేత దహింపబడేది. జీర్ణించేటువంటిది శరీరము. ఈ జీర్ణించిపోయే శరీరముచేత, దహించిపోయే శరీరముచేత శాశ్వతమైనటువంటి దానిని పొందుదామనే వాంఛ, ఇది కేవలము అల్పవాంఛ. భగవంతుడు ఒక్కొక్క ఇంద్రియమును కూడను ఒక్కొక్క కార్యము నిమిత్తమై నియమిస్తూ వచ్చాడు. తాను సృష్టించిన ధర్మమును సక్రమమైన మార్గమున వినియోగించినప్పుడే భగవంతుని అనుగ్రహానికి అవకాశముంటుంది. దేని నిమిత్తమై ఈ ఇంద్రియములు అందించాడో ఆ నిమిత్తమై ఈ ఇంద్రియాలను వినియోగించుకోవాలి. కనుకనే, ఈ ఇంద్రియాలను మనము సక్రమమైన రీతిగా అదుపులో పెట్టుకోవాలి. ముక్కు యిచ్చాడు భగవంతుడు. దీనిని సక్రమమైన విధంగా తీసుకొని, ఉచ్ఛ్వాసనిశ్వాసలచేత మన ప్రాణమును నిలబెట్టుకోటనికి కగిన ప్రయత్నము చేయాలి. అట్టి ముక్కును మనము నశ్యము పీల్చటానికి వినియోగిస్తే దీనియొక్క బాధ్యత అనేటువంటి స్థితి కొంతవరకు దూరమైపోతుంది. అదేవిధముగా మనకు ఒక నాలుకను అందించాడు. ఈ నాలుకను భుజించే నిమిత్తము. సాత్వికమైన ఆహారమును భుజించే నిమిత్తము ఈ నోటిని అందించాడు. ఈ నోటితో అపవిత్రమైన పదార్థములను, మద్యపానాది పదార్థములను

స్వీకరించటంచేత దీనియొక్క పవిత్రతను కొంతవరకును నిరూపణచేయటానికి వీలులేకుండా పోతున్నాది. అదేవిధముగా ఇంద్రియములను ఏఏ సమయములందు, ఏఏ విషయములయందు, ఏఏ కర్తవ్యములందు సక్రమమైన రీతిలో వినియోగించుకోవాలనే సత్యాన్ని చక్కగా విచారణచేసి మన ఇంద్రియాలను మనము అరికట్టుకోవాలి.

దివ్యాత్మస్వరూపులారా!

దేహము కేవలము జడమైనదని మీరనచ్చును. జడమైన దేహమైతే దినదినానికీ అభివృద్ధి పందుతున్నాదే! దీనిని జడమని ఎట్లు చెప్పవచ్చు? పెరగటానికి చైతన్యముండనక్కరలేదు. నిత్యము మన ఇంటిని ఊడ్చి ఇంతింత చెత్త ఒకచోట వేస్తూ వుంటే ఒక నెలాగితే పెద్ద దిబ్బగా తయారైపోతుంది. కాబట్టి, ఈ శరీరముతోబాటు దిబ్బకూడా పెరుగుతూ ఉంటుంది. ఈ శరీరానికి కూడను నిత్యము ఏదో ఒకటి టిఫినో, కాఫీనో, డిన్నరో, ఏవో పదార్థాలు వేస్తుంటే, ఇది పెరుగుతూ ఉంటుంది. ఈ పదార్థాలే తినిపించకుండా నిలిపి ఉంచితే ఏమాత్రముకూడను ఈ దేహము పెరగదు. అదేవిధముగనే దేహము జడమైనది కనుక, ఈ ఇంద్రియములను ఏవిధముగా నిగ్రహించుకోవటానికి ప్రయత్నము చేయాలి? ఉద్రేకములుకగాని, ఇంతేకాక విప్లవానకిగాని ఈ ఇంద్రియాలను ఏమాత్రమూ ప్రవేశపెట్టకూడదు. నిరుపయోగమైన దుఃఖమునకుకూడ దీనిని ఉపయోగములో పెట్టకూడదు. ఎందుకనగా దుఃఖమనునది మానవునకు సహజము కాదు. ఆనందమే అతని సహజము. అట్టి ఆనందము సహజమైనటువంటి మానవునకు దుఃఖము కేవలము కల్పితము. కనుకనే, మనము ఉద్రేకములకుగాని, రౌద్రమునకుగాని, విచారములకుగాని ఇంద్రియములను కొంతవరకు ప్రవేశపెట్టినప్పుడు మనయొక్క బలము, ఆత్మశక్తికూడ కొంతవరకు క్షీణించిపోతుంటాయి. నిజముగా మానసికమైన తలంపులచేతనే దేహమునకు అనారోగ్యము ఏర్పడుతూ ఉంటుంది. ఈ విచారములచేతను, దుఃఖములచేతను, ఉద్రేకములచేతను మానవుడు అతి త్వరగా వృద్ధాప్యాన్ని పొందుతున్నాడు. కనుకనే, మనము పవిత్రమైన మానవత్వాన్ని శిథలంచేసుకోవటానికి ముఖ్యంగా ఇంద్రియనిగ్రహమనేటువంటిది లేకపోవటమే మూలకారణము. కనుక, ఇంద్రియనిగ్రహమనే రెండవ పుష్పాన్ని మనం పరమాత్మకు అర్పితం గావించాలి.

సర్వభూతదయాపుష్పం. కేవలము అనేకత్వంలో ఉన్నటువంటి మానవత్వాన్ని మనము చూసుకుంటూ, భిన్నత్వాన్ని పాటించుకుంటూ, దైవత్వాన్ని విస్మరించుకుంటూ వస్తున్నాము. ఈవిధంగా భౌతికమైన వాంచలలో మనము మునిగిపోతున్నాము. ఇక లౌకిక వాంఛలు నెరవేరకుండా పోయినప్పుడు మనము భగవంతునికి విరుద్ధంగా మారిపోతున్నాము.

కోరు కోర్కెలవన్నియు తీరుచున్న
భక్తి దైవముపై హెచ్చు రక్తి పెరుగు
కోరు కోరికలన్నియు తీరకున్న
భక్తి తరుగును దైవ విరక్తి పెరుగు.

ఈ లౌకికమైన కోరికలచేత, ఇంద్రియనిగ్రహము లేకపోవుటచేత సర్వత్రా దైవమున్నదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోవటంచేత మన సహజ శక్తులుకూడను కోల్పోతూ వస్తున్నాము. మనయొక్క స్మృతులు, 'ఏకం సత్ విప్రాః బహుదా వదంతి' అన్నది. ఉన్నది ఒక్కటే అయినప్పటికీ, మనము 'ఏకోహం బహుశ్యామ్' అన్నట్లుగా ఏకత్వాన్ని నిరూపణచేసి మనము భిన్నత్వాన్ని కూడను అనుభవిస్తూ వస్తున్నాము. నిన్నటి దినము చెప్పినట్లుగా ఒక విత్తనము మనము నాటుతున్నాము. ఆ విత్తనమునుండి పెద్ద బ్రహ్మాండమైన వృక్షము తయారౌతుంది. ఆ వృక్షములో అనేక వేల కాయలు కాస్తూ ఉంటాయి. కాయ కాయయందుకూడను ఈ నాటినటువంటి బీజము చేరిపోతూ ఉంటుంది. అదేవిధముగా దైవత్వమనే విత్తనము నుండి చిత్తము అనే వృక్షము పెరిగిపోయింది. ఈ వృక్షమునందు జీవరాసులు, మానవత్వము అనేటువంటి కాయలు కాస్తూ వచ్చినవి. ఈ ఒక్కొక్క కాయయందుకూడ దైవత్వమనే విత్తనము అందులోపోయి చేరుతూ ఉంటుంది. భగవద్గీతయందు, 'బీజంమాం సర్వభూతానమ్'. అన్ని జీవులయందుకూడను నేను ఆత్మస్వరూపుడనై విత్తన రూపంగా ప్రకటిస్తూ ఉంటున్నానన్నాడు. కనుక, అందరియందుకూడను దైవత్వమనే ఆత్మ బీజ రూపంగా ఉంటున్నదనే సత్యాన్ని గుర్తించాలి. అందరియందు ప్రేమ, దయలతో మనము జీవితాన్ని గడుపుతూ రావాలి. 'ఈశ్వర స్సర్వభూతానామ్' – ఈ సత్యాన్ని మనము విశ్వసించినప్పుడే, 'సర్వభూత దయాపుష్పం' అనేది చక్కగా సుగంధముతో భగవంతునికి అర్పితంగావించటానికి అవకాశముంటుంది.

నాల్గవది క్షమాపుష్పం. ఈ 'క్షమ' అనేది నిజముగా మానవునియొక్క ప్రధానమైన గుణము. అయితే, ఈ మానవుడు సంకుచిత భావములను పెంచుకోవటంచేత, 'నేను, నావాడు' అనే కొంత హద్దులో మాత్రం జీవించటానికి ప్రయత్నిస్తున్నాడు. నేను, నా కుటుంబము, నా బంధువులు తప్ప మిగిలినవారు అందరూ నాకు వైరైనవారుగా భావిస్తున్నాడు. ఈ భావమున్నంత వరకు మనలో 'క్షమా' పుష్పము వికసించటానికి వీలులేదు. నిజముగా అందరూ మనవారే. అందరూ దైవత్వంతో చెందిన అంశములనే సత్యాన్ని

మనము గుర్తిస్తేఈ 'క్షమ' క్షణములో చిక్కుతుంది. కనుకనే, మనము ప్రేమించినప్పుడు మనకు 'క్షమ' కూడను లభిస్తుంది. దానికి పూర్వము 'సర్వభూత  దయాపుష్పం'. ఇదియు ప్రేమతో కూడినదే. చిన్న ఉదాహరణ. మన ఇంటిలో మన పిల్లలు ఉంటున్నారు. పిల్లలతోబాటు పనివారుకూడా ఉంటున్నారు. మన కుమారుడే మన ఇంటిలో నిత్యము ఏదో ఒక పదార్థమును దొంగిలించి కొన్ని దురభ్యాసములకు పాల్పడుతుంటాడు. కాని, ఆపిల్లవానిని అనేకరకములుగా దండించి, తిట్టి, కొట్టి ఏదో ఒకవిధముగా అదుపులోకి తేవటానికి ప్రయత్నిస్తాము. కాని, ఆ పిల్లవానిని పోలీసులకు అప్పచెప్పము. అదే ఇంటిలో ఒక పనిమనిషి ఉంటుంది. ఒక చిన్నస్పూను దొంగిలించినాడంటే తక్షణమే పోలీసులకు కంప్లైంటు చేస్తాము. తన కుమారుడు ఎన్ని దొంగతనములు చేసినప్పటికీ పోలీసులకు అప్పజెప్పక, ఇంట్లోని పనిమనిషిని చిన్న స్పూను దొంగిలించినందుకు ఇంత పెద్ద రామాయణం చేస్తుంటే ఇందులోనున్న అంతరార్థము ఏమిటి? ఈ పిల్లవాడు 'నా కుమారుడు' ఈ  అభిమానము, దురభిమానము, సంకుచితమైన అభిమానమే సమాజంలో ఒక కారణమౌతున్నాది. వాడు పరాయవాడు అని అనుకోవటంచేతనే అక్కడ క్షమకు ఏమాత్రం అవకాశము లేకుండా పోయింది. సర్వులూ నావారే అనే విశాలమైన భావాన్ని చూచుకొన్నప్పుడు ఇక్కడ 'క్షమ' మనకు సహజంగా లభిస్తుంది. అప్పుడే మనకు ప్రేమ అభివృద్ధి అవుతుంది. కనుకనే, love gives by giving and forgiving.  self lives by getting and forgetting. ఈ 'క్షమ' మనలో రావాలనుకొన్నప్పుడు ఈ ప్రేమ అనే పుష్పమును మనము వికసింపచేసుకొన్నప్పుడు 'క్షమా' పుష్పము సహజసిద్ధంగా మనకు లభిస్తుంది.

ఇంక ఐదవది 'శాంతి' పుష్పము. ఈ శాంతి అనగా కేవలము ఎన్ని తిట్టినా, ఎన్ని కొట్టినా ఏవిధమైన జవాబు చెప్పక మొండివానిలా కూర్చోటం శాంతి కాదు. తనలో లేని దోషములను ఎవరు ఎన్ని చెప్పినప్పటికీ ఏమాత్రమూ లెక్కచేయక తన హృదయాన్ని ఆలోచనచేత ఉద్రేకములకు అవకాశమునందిస్తున్నా ఒకవిధమైన నిశ్చలచిత్తుడై ఉండటమే 'శాంతి' అన్నారు. అనగా ప్రేమతో హృదయము విచ్చుకొన్నప్పుడు ఒకవిధమైన శాంతిగా మారుతుంది. నిజముగా శాంతి బయటనుండి ప్రవేశించే పదార్థము కాదు. మన దుర్గుణములచేత మనకు కొంతవరకు అశాంతి ఏర్పడుతుంది.

సత్యసంకల్పములచేత  సాధువగును
దుష్టసంకల్పములచేత  దుఃఖితుడగును
సకల సంకల్పరహితుడే శాంతి పొందు
సకల సంకల్ప శూన్యుడే శాంతి పొందు.

కనుక, మన సంకల్పవికల్పములను కొంత అరికట్టిన శాంతి లభిస్తుంది. ఈనాడు మన దుఃఖములకంతా హేతువేమిటి? దుఃఖమునకు దుష్టసంకల్పములే కారణము. సాదువనగా కేవలము కాషాయవస్త్రాలు వేసుకోవటము, గుండు గీచుకోవటము, రుద్రాక్షమాల వేసుకొనటము కాదు. సత్యసంకల్పములచేత సాధువగును. ఈ శాంతి స్థితి ఏరీతిగా ఉంటుందంటే అంచంచలమైన జలమువలె ఉంటుంది. వాటిలో నీరు ఉండినప్పుడు గాలి వత్తిడిచేత జలములో అలలు బయలుదేరుతూ ఉంటాయి. అందులో మన ప్రతిబింబము ఆడుతుంటుంది. మలినమైన జలములో మనయొక్క ప్రతిబింబము మాలిన్యముగానే ఉంటుంది. నిశ్చలమైన జలములో మనయొక్క ప్రతిబింబము కూడా నిశ్చలముగా ఉంటుంది. అదేవిధముగా అందరియందు ఆత్మ ఉండినప్పటికీ మూలాధారమైన సత్యము ఒక్కటే అయినప్పటికీ తమోగుణమైన దీనియంధు ప్రతిబింబించే ఆత్మకు కేవలము మాలిన్యమైన మాయ అవిద్యగా రూపొందుతున్నది. అలలుగా ఉండిన జలములో మనయొక& ఆత్మ అనేటువంటిది రజోగుణమైనది. కనుక, ఇది కొంత అలలుగా భాసిల్లుతుంది. కనుక, దీనిని అవిద్య అందురు. ఇంక, సాత్వికమైన, స్థిరమైన జలములో ఉండేటువంటి ప్రతిబింబము ఇదే. మాయ అంటారు. మాయ కాదు , ఈశ్వరుడు. కనుక, సాత్విక ప్రతిబంబమే ఈశ్వరత్వము. రజోగుణ ప్రతిబింబమే జీవుడు. తమోగుణ ప్రతిబింబమే ప్రకృతి. ఈ ప్రకృతి - జీవ- ఈశ్వరత్వములనేవి కేవలము ప్రత్యేకమైనవి కావు. బింబము ఒక్కటే అయినప్పటికీ ప్రతిబింబములు, భావము, దానియొక్క మార్పులేగాని అన్యము కాదని గుర్తించాలి. మూలాధార సత్యమును ముఖ్యముగా మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఒక ఫలము ఉంరున్నాది. వేపపండైనప్పటికీ పూర్తిగా పక్వమైనప్పుడు దానికి మాధుర్యముకూడ చేరుతుంది. మనము పూర్ణస్థితిని పొందినప్పుడే శాంతి అనే మాధుర్యము ఇందులో చేరుతుంది. ఎప్పుడు మనకు శాంతి లభిస్తుంది? క్షమను మనము పోషించుకున్నప్పుడే శాంతి లభిస్తుంది.

ఇంక ఆరవ పుష్పము 'తపః' పుష్పము. ఈ తపస్సనగా ఏమిటి? ఆలుబిడ్డలను వదలి అరణ్యానికి వెళ్ళి తల క్రింద కాళ్ళు పేకి పెట్టి కూర్చోటం కాదు. ఈనాడు తపస్సనగా కేవలము సర్వసంగపరిత్యాగియై, అడవులకు వెళ్ళి నిరంతరమూ దైవాన్ని చింతించటమే తపస్సుగా భావిస్తున్నాము. మనలోని దుర్బుద్ధులను దూరము చేయాలి. మనస్సు, కాయము, వాక్కు - మూడింటియొక్క ఏకత్వమే తపస్సు. మన హృదయములో ఏమి సంకల్పించుకున్నామో దాన్ని మాటలలో చెప్పి, చెప్పిన మాటలను క్రియలలో ఆచరించటమే తపస్సు. దీనిని పురస్కరించుకొనియే, 'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనః' అన్నారు.

భావమందు తుచ్ఛభావాలు వీడుటే
త్యాగమగును అదియె యోగమగును
ఆస్తి ఆలిని వీడి అడవికేగుట కాదు
సత్యమైన బాట సాయి మాట.

త్యాగమనగా ఆస్తిని, ఆలిని వీడి, బిడ్డలను వీడి అరణ్యాలకు పోవటము త్యాగముగా భావిస్తున్నారు. చాలా పొరపాటు. మన భావమునండి దుర్భావములను దూరముచేయాలి. కనుక, ఈ తపస్సనగా వేరే రీతిగా మీరు భావించుకోకూడదు. ఈ మనోవాక్కాయ కర్మలను ఏకముచేసి నీవు ప్రవర్తించటమే తపస్సు.

ఇంక ఏడవ పుష్పము 'ధ్యాన' పుష్పము. ఈనాడు ధ్యానములు అనేకరకములుగా బయలుదేరుతున్నాయి. నిజముగా ఈనాడు మనము చేసేటువంటి ద్యానములన్నియూ మన భారతీయ సంస్కృతికి విరుద్ధమైనవే. నిజముగా మనకు ధ్యామిదే అయితే మనము కేవలము పద్మాసనము వేసుకొని మూలాధార చక్రమునుండి సహస్రారము వరకు యీయొక్క కుండలినీ శక్తిని ప్రవహింపజేసేది ధ్యానం కాదు. ధ్యానమనగా సర్వ కర్మలయందును దైవత్వాన్ని విశ్వసించటమే నిజమైన ధ్యానము. అనగా ఏమిటి? సర్వాంతర్యామి, సర్వాంతరాత్మ, సర్వవ్యాపకుడు అనే దైవాన్ని సంకుచితమైన భవంతో నీవు ఒకవైపున నిలబెట్టుకొన ప్రయత్నము చేయటము. ఇది కేవలము ఒక సంకుచితమైనట్టి ధ్యానము. నీవు మార్కెట్‌లో వ్యాపారం చేస్తుంటే మార్కెట్టే నీరు దైవము. మన భారతీయ సంస్కృతియందు దైవత్వముగా భావించుకొని మన ప్రధానమైన కర్మకు ప్రకృతికి మనము నమస్కరించటము. కనుకనే, ప్రతి కర్మ ఆచరించే ముందుగా మనము నమస్కరించాలి. కర్మస్వరూపమైన దైవమును మనం సాక్షాత్కరింపజేసుకోవాలి. కనుకనే, ఉపనిషత్తులలో 'తస్మైనమః కర్మణే' మొట్టమొదట నేను చేసేటువంటి కర్మకు నేను నమస్కరిస్తున్నాను అని బోధిస్తున్నాది.

దివ్యాత్మస్వరూపులారా!

నిత్యజీవితములో మనము ఇలాంటి దైవత్వాన్ని నిరూపణగా ప్రదర్శిస్తున్నాము. చూడండి! తబలా కొట్టే అతను తబలా కొట్టేందుకు ముందుగా తబలాకు నమస్కరించుకొని తబలా కొడుతున్నాడు. హార్మోనియం వాయించేవాడు హార్మోనియంకి నమస్కారం పెడుతున్నాడు. నర్తకి డాన్సు ఆడేటువంటి ఆమె మొట్టమొదట గజ్జలకు నమస్కారము చేసుకొని కాలికి కడుతుంది. అదేవిధముగా జడమైనటువంటి లారీని డ్రైవ్ చేసేటప్పుడు డ్రైవరుకూడను మొట్టమొదట స్టీరింగుకు నమస్కారము చేసుకొని పట్టుకొంటున్నాడు. అంతవరకు మనము పోనక్కరలేదు. మనము ఎట్లైనా నడుస్తుంటే మన కాలు ఎవరికైనా తగులుతుంటే తక్షణమే వారికి మనము నమస్కారము చేస్తున్నాము. దీని భావమేమిటి? ఇవన్నియూ కూడను సర్వభూతములయందు, సర్వపదార్థములందుభగవంతుడున్నాడనే విశ్వాసంచేతనే మనము నమస్కరిస్తున్నాము. జగత్తంతయూ విరాట్‌స్వరూపముగా భావించుకొని మన కర్తవ్యకర్మలు నిర్వర్తించటమే సరియైనటువంటి ధ్యానము. నీ భావము సర్వదా దీనియందుకూడను లగ్నమయ్యే టట్టు భావించుకో. సర్వ జగత్తంతాకూడను నీ భావమునందే యిమిడియుండినట్లుగా భావించుకో.

కృష్ణుడు విరాట్‌స్వరూపాన్ని నిరూపించాడు అర్జుననుకు. దీనియందున్న అంతరార్థాన్ని మనము చక్కగా విచారిస్తే జగత్తంతా కూడను ఈశ్వరత్వమనేది మనకు అర్థమౌతుంది. అర్జునుడు దేనిని చూచాడు శ్రీకృష్ణునియందు? ఒక్క కృష్ణునియందే సముద్రములను, పర్వతములను, జీవరాసులను, సర్వభూతములను, సమస్తముకూడా కృష్ణునియందే చూచాడు. కనుక, సర్వమూ ఈశ్వరునియందే ఉండటంచేత ఈ విశ్వమంతాకూడను కృష్ణుని మయము. ఈశ్వరమయముగా మనము భావించుకొని దీనికి ధ్యానముచేయటానికి ప్రయత్నించాలి. అట్లుకాకుండా కృష్ణుడు నావాడు అని నీ హృదయంలో నీవు బంధించుకుంటే, ఇది సరియైనటువంటి పరాభక్తికి తగిన అర్థం కాదు. నేను కృష్ణుని వాడను, కృష్ణునిలో ఉన్నటువంటివాడను అని మనము భావించుకోవాలి. నేను నీవాడను అనుకోవటంచేత శరణాగతి అవుతుంది. ద్వారకావాసులు కృష్ణుని మావాడు, మా యాదవకుల కృష్ణునిచేతనే పాండవులు విజయాన్ని సాధించారు అని. 'మా కృష్ణుడు, మా యాదవుడు' అనుకోవటంచేత యాదవకులములో ముసలము ప్రారంభమైంది. ఇది కేవలము అభిమానాన్నికూడా పెంచుతూపోతుంది.కాని, గోబికులముయొక్క గోపికలు ఆవిధముగా భావించలేదు. 'కృష్ణా! మేము మీవారము' అన్నారు. కనుకనే, భగవతమందు కృష్ణునికి అర్పితమైనవారు గోపికలు. కృష్ణుడు మావాడు అన్నటువంటివారు ద్వారకావాసులు. అదేవిధముగనే, నేను నీవాడను, నేను నీలోనే ఉంటున్నాను. నా చుట్టూ అంతా దైవమే ఉంటుంది. దైవముయొక్క అదుపులో నేను పెరుగుతున్నాను' అనే భావసావరూపాన్ని మనం విశ్వసించి విశ్వస్వరూపాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. ఇది ధ్యానమునకు సరైన గుణము.

ఇంక సత్యము. ఈ సత్యమనగా ఏమిటి? చూచింది చూచినట్లుగా చెప్పటము, విన్నది విన్నట్లుగా చెప్పటము, చేసింది చేసినట్లుగా చెప్పటము సత్యముగా మారుతుందా? కాదుకాదు. ఇది లౌకిక సత్యము. సత్యము త్రికాలములందుకూడను

మారనటువంటిది. నీవు చూచినది అప్పటికి మాత్రమే సత్యము. మరునిముషానికి అసత్యమైపోతుంది. ఈ జగత్తునందున్న సర్వపదార్థములు కేవలము నాశనమయ్యేటువంటివే. మార్పుచెందేవే. నశ్వరమైనట్టి ఈ జగత్తునందు మనము చూచినది, మనము చేసినది, మనము విన్నది అన్నీకూడా సత్యములెట్లవుతాయి? ఈ సత్యమనేది కట్టకడపటి అష్టమ పుష్పము. ఈ సత్యమే దైవస్వరూపము.

ఈనాడు లోకములో కొన్ని సత్యాలు మనం చూస్తున్నాము. కెమిస్ట్రీ తీసుకోండి. కొన్ని కొన్ని పదార్థములు ఒకదానికొకటి చేరినప్పుడు మరొక పదార్థముగా మారిపోతుంది. సున్నములో పసుపు కలిపినప్పుడు ఎరుపుగా మారిపోతుంది. ఇది కెమిస్ట్రీ సత్యము. ఇక ఫిజిక్సు చూద్దామంటే, ఒక సూదిని తీసుకొని నిప్పులో పెట్టండి. మూడు ఇంచిల సూది నిప్పులో పెడితే మూడున్నర యించిలు సూదిగా తయారౌపోతుంది. ఇది ఫిజిక్సు సత్యము. ఈ ఫిజిక్సు ఎంతవరకు సత్యము? ఈ కెమిస్ట్రీ ఎంతవరకు సత్యము? ఇది కేవలము భౌతికమైన, లౌకికమైన, వైజ్ఞానికమైన సత్యము. కాని, ఆద్యాత్మిక సత్యము ఎన్ని అగ్నులలో వేసినప్పటికీ, ఎంత వేడిలో ఉంచినప్పటికీ ఎప్పటికీ మారక, కదలక, చెదరక ఏమాత్రమూ మార్పుచెందక ఒకే స్థాయియందు ఉంటుంది. కనుకనే, మార్పుచెందక సత్యంగా ఒకే స్థాయియందు ఉంటుంది. మార్పుచెందనిదే నిజమైన సత్యము. ఆ మార్పుచెందనటువంటిది దైవత్వము.

ఈనాడు మనము పవిత్రమైన యిట్టి గుణములను అభివృద్ధిచేసుకోవటానికి తగిన ప్రయత్నము చేయకపోవటంచేతనే జగత్తులో యిన్ని రకములైన కఠినత్వములు, ఇన్నిరకములైన క్రూరత్వములు చెలరేగిపోతున్నాయి. ఈనాడు ఆస్తికులయందు, నాస్తికులయందు, ఆస్తికనాస్తికులయందు, నాస్తిఆస్తికులయందుకూడను ఒక సమత్వంచేరి తయారౌతుంటుంది. కాదు, కాదు. ఆస్తికులైనవారుఈ సద్గుణములను ఏనాడు ప్రతిబింబించుకొందురో ఆనాడే జగత్తులో నాస్తికత్వము శూన్యమైపోతుంది. భగవంతుని యొక్క తత్త్వము ఎలాంటిదనగా సతమ, చిత్, ఆనందము అన్నారు. ఈ సత్, చిత్, ఆనందము మూడుకూడను ప్రతి మానవునియందు తాండవమాడుతున్నాయి. సత్యమైనటువంటి ప్రవర్తనచేత విజ్ఞానాన్ని మనము పెంచుకుంటే ఆనందము మన హస్తగతమౌతుంది. సత్యము మనయందే ఉంటున్నది. విజ్ఞానము మనయందే ఉంటున్నది. మనము అధికారస్థాయి కాకుండిన ఈ అధికారస్థాయి యందలి ఆనందమును ఏరీతిగా అనుభవించగలము? కనుక, మనముకూడము సత్, చిత్, ఆనందస్వరూపులమే కావాలి.

*the one you think you are is sat*

*the one others think you are is chit*

*the one you really are is anandam.*

ఈ సచ్చిదానందమనేది మానవుని హక్కు. మానవునియొక్క స్వభావము. మానవునియొక్క సహజత్వము. ఇలాంటి దానిని మనము చక్కగా గుర్తించుకొనలేక పరులను దూషించటము, పరులను కొంతవరకు హేళనచేయటము ఈవిధమైన దానిలో మనము పోయి వారి పాపములను మనము పంచుకోవటానికి ప్రయత్నంచేస్తున్నాము. ఇతరులను పరిహాసము చేయకూడదు. ఇతరులను ఏమాత్రం నొప్పించటానికి ప్రయత్నించకూడదు. ఒకవేళ ఇది ప్రాకృతమైన దోషంగా కనిపించినప్పుడు మంచి మాటలచేత వారిని సవరించటానికి  ప్రయత్నించాలి.

అనంతమైన అగాధమైనటువంటిది సంశయము. ఈ సంశయమే మానవుని మ్రింగే పెనుభూతము. సంశయముండిన మానవునకు ఏమాత్రమూ నిద్ర ఉండదు. వంటికి విశ్రాంతి ఉండదు. కేవలము ప్రేమ అనే పుష్పమునకు కీటకము వంటిది సంశయము. కనుక, సంశయములతో కూడిన హృదయము  గబ్బిళములయొక్క మందిరము. కనుక, మనము ఎట్టి సందియములకు అవకాశమివ్వకుండా సర్వత్రా దైవత్వమున్నదనే సత్యాన్ని నిరూపణ చేయాలి. అంటే అష్ట పుష్పములచేత భగవంతుని ఆరాధన చేయాలి.

ప్రేమస్వరూపులారా!

మనము ఏదానియందు అదికముగా, అమితంగా ప్రవేశించకూడదు. ఈ జగత్తునకు సస్యశ్యామలాన్ని అందించి, జలమును అందించి, ప్రాణములను పోషించే సముద్రముకూడను తాను హద్దులు మీరి ఏమాత్రమూ రాదు. అన్నగతమైన దేహానికి పుష్టిని, మానసికమైన సంతుష్టిని అందించే అన్నమును మితిమీరి తిన్నామంటే, ఇది విషమయంగా మారిపోయి అనారోగ్యానికి గురౌతుంది. ఇంతియేకాదు, మనము తాంబూలం వేసుకొంటాం. ఈ పాన్‌కు సున్నము లేకపోతే మనకు రుచియే ఉండదు. కాని, సున్నము అవసరముకదాయని ఎక్కువ సున్నం వేసుకుంటే నోరంతా పొక్కిపోతుంది. అదికూడను ఒక లిమిట్‌లో, హద్దులో ఉండాలి. అందువలనే మన పవిత్రమైన మహాఋషులందరూకూడను అనుభవముతో, అధికారికరీతిగా లోకానికి అందిస్తూ,

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు. కనుక, దేనియందు మనము అతిగా పోకూడదు. పూర్తిగా మతము చేయకూడదుకూడా. అతిగా మారిపోయినటువంటిది మతిహాని తెప్పిస్తుంది. పూర్తి మితముగా ఉన్నటువంటిది శరీరాన్ని క్షీణింపచేస్తుంది. మధ్యస్థాయిలో ఉంటుండాలి. కనుక, మనము ఏది చూచినా, ఏది చేసినా దివ్యమైన దైవస్వభావంగా భావించుకొని పదార్థాన్ని దైవత్వముగా భావించుకోవటం సరియైన, సాధ్యమైన భక్తిమార్గము.

అయితే, ప్రప్రథమములో కొన్ని విగ్రహాలు, కొన్ని రూపములు నీవు దైవంగా భావించుకో. కాని, క్రమక్రమేణా ఆ దైవత్వం కేవలం పటాలుకాదని గుర్తించాలి. దీనినే, you may worship the picture as god, but not god as picture. ఈ తత్త్వాన్ని అలవరచుకోవాలి. సహజభక్తినుండి, విశేషభక్తినుండి ఉన్నత స్థాయికి మనము చేరటానికి ప్రయత్నముచేయాలి. లౌకికభక్తి మొట్టమొదటి సోపానము. అదే పుష్పమువంటిది. క్రమక్రమేణా కాయగా మారుతుంది. ఇంక పవిత్రమైన పరాభక్తియే నిజమైన ఫలమువంటిది. అనగా గుణములు అర్పితముగావించుకోవటమే పరాభక్తి అన్నారు. పుష్పము లేకుండా కాయ లేదు. కాయ లేకుండా ఫలము కానేరదు. ఈ సత్యాన్ని మనము గుర్తించుకొని క్రమక్రమేణా ఉన్నతస్థాయికి చేరే ప్రయయత్నము చేసినప్పుడే మన భక్తిప్రపత్తులు ఉన్నతస్థాయిని చేరి దివ్యత్వమనే ఆత్మతత్త్వములో ఆనందాన్ని అనుభవిస్తాము.

ప్రేమస్వరూపులారా!

మన ధర్మక్షేత్రము ప్రారంభమై 12 సంవత్సరములైనప్పటికిని, క్రమక్రమేణా మనము ఉన్నతస్థాయికి ఎగబ్రాకక ఉన్న స్థాయియందే ఉండి, మన సాధనలు క్రమక్రమేణా అభివృద్ధికావటానికి ఏమాత్రమూ తగినటువంటి ప్రోత్సాహములు లేక మీరు కొంతవరకును నిరుత్సాహానికి గురైపోతున్నారు. కనుక, భజనలు చేయండి. పూజలు చేయండి. కాని, సమాజములో మనము దిగినప్పుడు సమాజములో ఉండినటువంటి ప్రత్యక్షస్వరూపాలే దైవస్వరూపాలుగా భావించుకొని ఆ సమాజ సేవలో మన జీవితాన్ని అంకితముగావించాలి. సద్గుణములను పెంచుకోవాలి. అప్పుడే ఈ జగత్తంతాకూడను ఈ అల్లకల్లోలములకు అవకాశము లేకుండా ప్రశాంతమైన, పవిత్రమైన భారతదేశంగా రూపొందుతుంది. విశ్వరూపుడైన పరమాత్ముని కేవలము నీవైపే ఉండే ఫొటోలోపల మాత్రమే ఫ్రేము కట్టి, అక్కడే ఉంటున్నాడు దైవమనే సంకుచిత భావానికి మనము అవకాశము యివ్వకూడదు. కనుక, విశాలమైన, బ్రహ్మాండమైన భగవంతుని కేవలము చిన్నవానిగా మనము చూచుకోవటము సంకుచితమైన తత్త్వము. నీ హృదయాన్ని విశాలము చేసుకుంటూ విసాలమై దైవత్వంలో లీనంగావించాలి. సంకుచితమైన భావంనుండి ప్రారంభం కావాలి. బెలూన్ చూస్తే ఒక్క మాదిరిగా ఉంటుంది. కాని, దానిని ఊదుతూ, ఊదుతూ, ఊదుతూ వస్తే క్రమక్రమేణా ఒకతూరి బరష్టు అయిపోతుంది. కనుక, మనయొక్క సంకుచితమైన భావాలు, నేను నావాడు అనే కొంత స్థాయికి వచ్చిన తరువాత సర్వులూ నావారే, విశ్వమంతా నావారే అనే ప్రధానమైన ఉన్నతసా&థయికి తెప్పించుకున్నామంటే, ఒక్కసారి పగిలి విశ్వరూపమైన దైవత్వం లోపల ఈ భావముకూడను ఏకత్వాన్ని పొందుతుంది.

మన జీవితములో 'నేను' అనే ప్రదేశమునుండి 'మనము' అనే స్థానానికి ప్రయాణము చేస్తున్నామనే సత్యాన్ని గుర్తించాలి. కాని,ఎంతవరకు నేను, నేను అనే స్థానము దగ్గరే ఉంటే నీ ప్రయాణము సాగదు. ఈశ్వర సృష్టి జీవునకి దేవునికి మధ్య ఉండే బ్రిడ్జి వంటిది. ఈ ప్రకృతి అనేది ఒక పర్వతము. దైవత్వమనేది మరొక పర్వతము. రెండింటిని చేర్చేదే మన ప్రకృతియొక్క తత్త్వము. కనుక, ఈ బ్రిడ్జికి మనము దూరమైపోతున్నామా, ఏమాత్రమూ మనము గమ్యానికి చేరలేము. మనము ప్రకృతిలో, సమాజములో దుమికి సద్గుణాల్ని పోషించుకొని తద్వారా ఈ జగత్తనేదానిని ప్రశాంతమైన వాతావరణంగా తీర్చిదిద్దాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.